క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా మురళీధర్‌రెడ్డి



మురళీధర్‌రెడ్డిని అభినందిస్తున్న ఉక్కు ఉద్యోగులు

అగనంపూడి: లయన్స్‌క్లబ్ కూర్మన్నపాలెం అధ్యక్షుడిగా ఎ.మురళీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి ఎన్నికైన మురళీధర్‌రెడ్డిని విశాఖ స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంఘ నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కుమారస్వామి, జి.ఆనంద్, ఎస్.నరసింగరావు పాల్గొన్నారు.

29న మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: ప్రియదర్శిని యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ రామాలయం వద్ద ఈ నెల 29న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేనగాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు ఆవిష్కరించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం వారు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగ కృష్ణ, సమ్మిడి ఆనందరావు, లంకాడ శ్రీనివాసరావు, ఆకుల మహేష్, గవ్వల బాలరాజు, అంగ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నేడు



మాట్లాడుతున్న పీజీ మన్నాజీ

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) గాజువాక మండల స్థాయి క్రీడా పోటీలు గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి మన్నాజీ చెప్పారు. కణితి హైస్కూల్‌లో ఆదివారం గాజువాక మండల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు (అండర్ 14,17) పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని, విద్యార్థులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ధృవీకరించిన అర్హత పత్రంతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. వివరాల కోసం 7396542409, 94406 41451 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనను ఎండగడుతూ 28వ వార్డు పందిమెట్ట వద్ద ఐద్వా నేతృత్వంలో ఆదివారం స్థానిక ప్రజలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు సత్యవతి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి ఊసే పట్టనట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 'మాది మంచి పాలన'అని సొంత డబ్బా కొట్టుకుంటూ స్టిక్కర్లు అంటించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నిజానికి ఈ వంద రోజుల్లో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.



పార్కింగ్ షెడ్ల వద్ద నిలిపిన సిటీ బస్సులు

- స్టాప్ ఒక చోట... ఆపేది మరో చోట
- ప్రయాణికులకు తప్పని పాట్లు
- ఆర్టీసీ అధికారుల తీరుపై ఆగ్రహం

వీరింతే!

అగనంపూడి: ఏపీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల తీరుపై ప్రయాణికులు మండిపడుతున్నారు. సంస్థ పురోభివృద్ధిపై శ్రద్ధ లేదని ఆరోపిస్తున్నారు. సమయానికి సర్వీసులు నడపడం.. స్టాప్‌ల్లో బస్సులు ఆపకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని చెబుతున్నారు. ఈ కారణంగా సిటీ బస్సులు ఎక్కాలనే ఆలోచన మానుకొని ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. బస్టాప్‌లకు దూరంగా బస్సులు నిలపడంతో ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. ఒకవేళ పరిగెత్తి వెళ్లినా.. బస్సు కదిలి పోవడంతో నిరాశకు గురవుతున్నారు. దీంతో చాలా మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడంతో ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతోంది.

ఇదీ పరిస్థితి

దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ప్రయాణికుల కోసం రెండేళ్ల కిందట జీవీఎంసీ బస్ షెల్టర్ నిర్మించింది. వీఎస్ఈజెడ్ గోడను ఆనుకొని ప్రయాణికులు సేదతీరడానికి వీలుగా దీన్ని ఏర్పాటు చేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, చోడవరం, సింహాచలం, పెందుర్తి వరకు సిటీ బస్సులను సంస్థ నడుపుతోంది. 110 ట్రిప్‌లు దువ్వాడ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే సిటీ బస్సులు బస్టాప్ వద్ద కాకుండా వాహనాల పార్కింగ్ షెడ్ల వద్ద ఆపుతున్నారు. ప్రయాణికులు బస్టాప్‌కు సమీపంలో చెట్ల కింద వేచి ఉన్నా స్టాప్‌ల వద్ద ఆపడం లేదు. దీంతో పిల్లలు, లగేజీలు, వృద్ధులతో సుదూరం నుంచి ప్రయాణం చేసి వచ్చే ప్రయాణికులు విసుగెత్తి ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి సిటీ బస్సులు బస్‌షెల్టర్ వద్ద నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సిబ్బంది తీరు మారాలి



సిటీ బస్సులు ముందుగా రైల్వేస్టేషన్‌కు వచ్చి ఉంటున్నాయి. పార్కింగ్ షెడ్ల వద్ద నిలిపేస్తున్నారు. ప్రయాణికులు ఎవరైనా వెళ్లి బస్సు ఎక్కాలని చూస్తే సిబ్బంది అనుమతించడం లేదు. కసురుకుంటున్నారు. బయలు దేరినప్పుడే ఎక్కాలని చెబుతున్నారు. లగేజీలు, పిల్లలు, వృద్ధులతో ఎక్క లేక ఆటోలను ఆశ్రయిస్తున్నాం. సిబ్బంది తీరు మారాలి.

– రామకృష్ణరాజు, గాజువాక

బస్ షెల్టర్లు ఎందుకు?



సిటీ బస్సు ప్రయాణికుల సౌకర్యం కోసం నిర్మించిన షెల్టర్ సిబ్బంది తీరుతో నిరుపయోగంగా మారింది. బస్సులు షెల్టర్ వద్దకా కుండా వేరే ప్రదేశంలో ఆపడంతో ప్రయాణికులు చెట్ల కింద ఎండలో, వానలో తడుస్తూ నిరీక్షిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి షెల్టర్ల వద్ద బస్సులు ఆపేలా చూడాలి.

– శంకరరావు, ప్రయాణికుడు

ఉక్కు ఉద్యమం ఉధృతం



కూర్మన్నపాలెం దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నేత పరదేశి



అగనంపూడి ఎస్‌బీఐ కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు ఉద్యమం ఉధృతం చేస్తున్నారు. ఒక వైపు కేంద్రం ఉక్కును నిర్వీర్యం చేసే విధంగా చర్యలు చేపడుతుంటే.. కార్మిక వర్గం ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఉద్యమిస్తోంది. దీనిలో భాగంగా ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు.

1319వ రోజుకు దీక్షలు : విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు 1319వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు, నూతన వేతన సవరణ లేకపోవడం చూస్తుంటే కర్మాగారాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్ర కోణం కనిపిస్తుందన్నారు. యూనియన్ అధ్యక్షుడు గొందేశి వెంకటరమణారెడ్డి, కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి మాట్లాడుతూ వీఆర్ఎస్ పథకం కోసం రూ.1250 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ముడిపదార్థాల కొనుగోలుకు ఒక్క రూపాయి కూడా విదిలించకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో బోరా శశిభూషణరావు, డి.ఆదినారాయణ, దరిగి రవి, ఆర్.జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

అగనంపూడి కూడలిలో.. : అగనంపూడి ఎస్‌బీఐ కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. సిటూ నాయకులు జె.అయోధ్యరామ్, పెదిరెడ్ల నీలకంఠం మాట్లాడుతూ దీర్ఘ కాలంగా దీక్షలు చేస్తున్నా కేంద్రం పట్టించుకోపోగా, కార్మికులను పొమ్మనలేక పొగబెడుతూ మానసిక ఆందోళనకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలోనాయకులు వై.టి.దాస్, యు.రామస్వామి, ఉరివిటి మరిడయ్య, పట్టా రమేష్, చిత్తా అబ్బాయి, మొల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముస్తాఫా జంక్షన్‌లో.. : విశాఖ ఉక్కును పూర్తిసామర్థ్యంతో నడపాలని స్టీల్‌సిటీ గాజువాక జోన్ నాయకులు కె.జగ్గారావు, మార్పు దానయ్య డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టు చేస్తూ ఉక్కు యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. సిటూ ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో మహా ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా వడ్లపూడి మార్కెట్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి కేంద్రం కేవలం రూ.4890 కోట్లు ఇస్తే దానికి ప్రతిఫలంగా అన్ని రూపాల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ 55వేల కోట్ల రూపాయలు ఇప్పటి వరకు చెల్లించిందన్నారు. ప్రైవేటు సంస్థలకు లక్షల కోట్లు రుణ మాఫీ చేస్తున్న కేంద్రం ఉక్కు అప్పు తెచ్చుకోడానికి కనీసం గ్యారంటీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సంతోషకుమార్ రాజు, కె.శ్రీనివాసరావు, డీఎస్‌వీఎస్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ తక్షణం వైదొలగాలి

ఉక్కు శ్రామిక సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కోటేశ్వరరెడ్డి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల ప్రయోజనాలకు యాజమాన్యం కోత విధిస్తున్నా.. స్పందించని ఏఐటీయూసీ తక్షణం గుర్తింపు నుంచి వైదొలగాలని ఉక్కు శ్రామిక సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ గుర్తింపులోకి వచ్చిన తర్వాత నూతన వేతనాలు ఇప్పించకపోగా ఉన్న సదుపాయాలైన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తొలగింపు, ఇన్సెంటివ్ గణనీయంగా తగ్గించిన ఘనత వారికే చెందుతుందన్నారు. దీనికి తోడు టౌన్‌షిప్‌లో ఉన్న కార్మికులకు విద్యుత్ యూనిట్ చార్జి రూ.8 కు పెంచిన ఘనత వారిదే అని ఎద్దేవా చేశారు. సీడబ్ల్యూసీలను పూర్తిగా అవినీతిమయం చేసి కలెక్షన్ సెంటర్లుగా మార్చారని ఆరోపించారు. ఇదిలా ఉండగా హెచ్‌ఆర్ఏ, ఎల్‌టీఏ, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీలు ఆపడం ద్వారా ప్రతీ కార్మికుడికి నెలకు రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు నిలిపి వేతకు కారణమైన గుర్తింపు యూనియన్ అపకీర్తి మూటగట్టుకుందన్నారు. నిరంతరం ఉక్కు యాజమాన్యం సేవలో తరిస్తున్న వీరికి గుర్తింపులో ఉండే నైతిక హక్కు లేదన్నారు. వెంటనే వారు వైదొలగాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కరణం సత్యారావు, కోటేశ్వరరెడ్డి, బి. రమణ తదితరులు పాల్గొన్నారు.

జిప్సా నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాలతో నూతన కమిటీ

గాజువాక: గాజువాక ఇండస్ట్రియల్ ఏరియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా గిరీష్ స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ ఎస్.షణ్ముఖరావు, కోశాధికారిగా బాల వికాస్ స్కూల్ బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షులుగా పాలవలస భాస్కరరావు, ఆర్.శోభన్‌బాబు, సలహాదారులుగా పి.మురళీసుందర్, ఎం.జగ్గారావు, బి.శ్రీధర్, జి.జగన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.రాము, జి.కుమార్ తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గం రెండేళ్లపాటు గుర్తింపులో ఉంటుందని పేర్కొన్నారు. పి.ప్రభాకర్, డి.రాఘవరాజు, ఎం.జగ్గారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

మత సామరస్యంతోనే శాంతిస్థాపన

సీతంపేట : అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఫ్రీడం ఫర్ రెలీజియస్ సంస్థల ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలో గల గాంధీ సెంటర్‌లో 'శాంతి అభివృద్ధిపై' సదస్సు ఆదివారం నిర్వహించారు. ముందుగా సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు సర్వమత ప్రార్థన చేశారు. ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ మత సామరస్యంతోనే శాంతిస్థాపన సాధ్యమన్నారు. అభివృద్ధి సాధించాలంటే అన్ని దేశాలు శాంతిని పాటించాలన్నారు. సర్వ మతాలు ఐక్యంగా ఉంటే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో బ్రహ్మకుమారి బి.కె.కామేశ్వరి, ఏయూ తెలుగు ఆచార్యులు వెంకటేశ్వర యోగి, మయన్మార్ విద్యార్థులు రాజా దామా, కోన వెంకటరావు, ఉషారాణి, హరగోపాల్ పాల్గొని శాంతి ప్రతిజ్ఞ చేశారు.

నీటి సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి హైస్కూల్ వద్ద ఉన్న 200 కేఎల్ ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు.. అలాగే 86వ వార్డు వుడా ఫేజ్–1 వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పైప్‌లైన్ వాల్వ్‌ల మరమ్మతుల కారణంగా సోమవారం 86, 87వ వార్డుల పరిధిలో నీటిసరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ కేదారీనాథ్ తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

25న అర్చకులకు సన్మానం

అగనంపూడి: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి కమిటీ సారథ్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ప్రధాన ఆలయాల అర్చకులను ఈనెల 25వ తేదీన అగనంపూడిలోని దివ్యజ్యోతి భవనంలో సత్కరించనున్నట్టు దివ్యజ్యోతి భవనం ఇన్‌చార్జి బి.కె.రామకోటి అన్నయ్య చెప్పారు. అర్చకుల సన్మాన కార్యక్రమంపై అగనంపూడిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ధార్మిక పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రొంపిచర్ల సించాచార్యులు మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

భాస్కరబట్లకు సత్కారం



భాస్కరబట్ల ప్రసాద్ శర్మకు జ్ఞాపిక అందజేస్తున్న కరణంరెడ్డి

గాజువాక: సంగీతం, భక్తి గీతాలాపన, భగవద్గీత ప్రవచనం తదితర సేవలను అందిస్తున్నందుకు గాను నంది అవార్డు పొందిన భాస్కరబట్ల సత్య ప్రసాద్ శర్మను గాజువాక బీజేపీ నాయకులు సత్కరించారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



మాట్లాడుతున్న గౌరీ

అగనంపూడి: ఈ నెల 27న నిర్వహించనున్న విన్సెంట్ డీపాల్ పండగను పురస్కరించుకొని ఆదివారం వడ్లపూడి విచారణా తిరుకుటుంబ దేవాలయం ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వాసన్ ఐ కేర్ సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ సరిసా ప్రతాప్, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, ప్రవీణ్, నల్లా గౌరీ, జార్జి, సుకుమార్ పాల్గొన్నారు.

ఉప్పరకాలనీలో అన్న సమారాధన



అన్నప్రసాదాలు వడ్డిస్తున్న కోమటి శ్రీనివాసరావు

అగనంపూడి: గణేష్ ఉత్సవాల సందర్భంగా 87వ వార్డు వడ్లపూడి నిర్వాసితకాలనీలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో గుర్రాల ఆదిలక్ష్మి, ద్రోణాద్రి అప్పలనాయుడు, శ్రీనివాస్, గుర్రాల రామారావు, గజ్జెల శ్రీనివాస్, సూరిబాబు మనోహర్, మరిడిమాంబ, గణేష్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కేబీఆర్ జంక్షన్ వద్ద స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ధర్నా చేశారు. పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని ప్రభుత్వం, యాజమాన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చర్యలతో ప్లాంట్ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుందన్నారు. ప్లాంట్‌ను రక్షిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజల నమ్మకం కోల్పోకముందే నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ, కూటమి ఎంపీలపై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఆధారపడి ఉందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ఉక్కు మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మలు ప్లాంట్‌ను రక్షిస్తామని హామీ ఇచ్చి వెళ్లారని.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగేలా, పూర్తి ఉత్పత్తి చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్, మాజీ కార్పొరేటర్ కె. విమల మాట్లాడుతూ కార్మికుల జీతాల్లో కోత విధిస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బి. అప్పారావు, తౌడన్న, పుల్లారావు, వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుణ పరిమితి పెంపు.. వడ్డీ తగ్గింపు



కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతున్న వెంకటరాజు

గాజువాక: బీహెచ్ఈఎల్–హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు రుణ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచుతూ ఆదివారం నిర్వహించిన సొసైటీ మహాజనసభలో తీర్మానం చేశారు. రుణాలపై వడ్డీ రేటును 13 నుంచి 12 శాతానికి తగ్గించారు. రూ.5.48 కోట్ల టర్నోవర్ కలిగిన సంఘంలో 386 మంది సభ్యులున్నారని, ఈ ఏడాది రూ.2,19,550 ఆదాయం లభించిందని సొసైటీ కార్యదర్శి మండ వెంకటరాజు నివేదికలో పేర్కొన్నారు. సంఘం బైలాలో నంబర్ 4, 18, 19, 41(ఎ)లను సవరిస్తున్నట్టు పేర్కొన్నారు. సొసైటీ అధ్యక్షుడు కె.రామునాయుడు మాట్లాడుతూ సంఘ పురోభివృద్ధి కోసం పాలకవర్గానికి ప్రతి సభ్యుడు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా 2024–25 వార్షిక బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు జి.టి.పి.ప్రకాష్, జి.ప్రసాద్, ఎస్.బి.ప్రశాంత్ కుమార్, మేనేజర్ జి.వి.రమణారావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ షాప్స్‌కు పతకాలు



బంగారు పతకం అందుకుంటున్న ఇంజినీరింగ్ షాప్స్ జట్టు ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించిన చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ (సీసీక్యూసి)–2024 పోటీల్లో ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగం జట్లకు రెండు బంగారు పతకాలు లభించాయి. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఉక్కునగరంలో రెండు రోజుల పాటు సీసీక్యూసీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన వివిధ విభాగాలకు చెందిన జట్లతో పాటు దేశంలోని వివిధ సంస్థలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ప్రజంటేషన్ అనంతరం రెండు జట్ల ఉద్యోగులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ షాప్స్ విభాగాధిపతి ఎస్.కె. పాండే పతకాలు సాధించిన ఉద్యోగులను అభినందించారు.

కౌన్సిల్ తీర్మానం ప్రకారం వేతనాలు చెల్లించాలి

అగనంపూడి: మహా విశాఖ నగర పాలక సంస్థ నీటిసరఫరా, ఇంజినీరింగ్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి 2023లో చేసిన కౌన్సిల్ తీర్మానం మేరకు కనీస వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు దుగ్గపు దానప్పలు, సాగి సునీల్ కోరారు. 87వ వార్డు వడ్లపూడిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జులైలో జీవీఎంసీ కౌన్సిల్ సిబ్బంది జీతాల విషయంలో షెడ్యూల్ విడుదల చేసిందని, ఆ ప్రకారం జీతాలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. తక్షణమే అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.25,140, సెమీ స్కిల్డ్ వర్కర్లకు 29,610 చెల్లించాలన్నారు. అనంతరం వారు 86, 87 వార్డు కార్పొరేటర్లు లేళ్ల కోటేశ్వరరావు, బొండా జగన్‌లకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గోవింద్, భాస్కర్‌రాజు, రాఘవ, చిట్టి, అప్పలస్వామి, శెట్టి శ్రీను, అప్పలరాజు, ఈశ్వరరావు, శ్రీను, సుధీర్ పాల్గొన్నారు.

పేదలకు చీరలు, దుస్తుల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బొండా ఎల్లాజీ

అగనంపూడి: శ్రీమద్ రాజ్‌చంద్ర మిషన్ వ్యవస్థాపకులు రాకేష్ భాయ్ జావేరి జన్మదినోత్సవం సందర్భంగా 86వ వార్డు కూర్మన్నపాలెం ఫేజ్–6 ఎన్టీఆర్ కాలనీ, రజక కాలనీల్లో పేద మహిళలకు చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు బొండా ఎల్లాజీ, శ్రీదేవి దంపతులు మహిళలకు చీరలతో పాటు పిల్లలకు వస్త్రాలు, ఆట బొమ్మలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మ, గంధం లావణ్య, సంస్థ నిర్వాహకులు సాహితీ పింఛ, ఉజ్వల్ పరేఖ్, లీనా పరేక్, వసుందరా ఖరా పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్ : ధరలకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించి పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, గతంలో ఎన్ఎంఆర్, డైలీవేజ్, పార్ట్‌టైం, కంటింజెంట్, క్యాజువల్ ఇలా ఏ పేరుతో పిలిచినా ఐదేళ్లు పూర్తయితే పర్మినెంట్ చేసేవారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం సమీపాన సిటు కార్యాలయంలో సమాన వేతనం రూ.28,728 చెల్లించాలంటూ ఈ నెల 30న చేపట్టనున్న మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ యజమానులే నేరుగా చట్ట సభలైన అసెంబ్లీ, పార్లమెంట్‌కు ప్రతినిధులుగా వెళ్లడం వల్ల చట్టాలు మార్చేసి, కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. పర్మినెంట్ చేసి ఉంటే అన్‌స్కిల్డ్ కనీస వేతనం రూ.28,728 చెల్లించాల్సి ఉంటుందని, 1994లో తెలుగుదేశం ప్రభుత్వం 2/94 చట్టం తెచ్చాక శాశ్వతంగా పర్మినెంట్ కాకుండా, కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ కార్మికులుగానే కొనసాగిస్తుందని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన ప్రదర్శనలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రాజు, ఉపాధ్యక్షుడు రమణ, నాయుడు, కె. వెంకట్రావు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.